క్లుప్తంగా

నర్సరీ పరిశీలన



జైపూర్: మొక్కలు పరిశీలిస్తున్న జెడ్పీసీఈవో

జైపూర్: మండలకేంద్రంలోని నర్సరీని జెడ్పీ సీఈవో నరేందర్ మంగళవారం సందర్శించారు. మొక్కలను పరిశీలించి ప్రతి రోజూ నీటిని అందించాలని, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సిబ్బంది పలు సూచనలు, సలహాలు అందించారు. ఆయనతో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్, కార్యదర్శి ఉదయ్, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

కాసిపేట: మండలంలోని చిన్నధర్మారం, మామిడిగూడ గ్రామపంచాయతీలోని నర్సరీలను మంగళవారం ఎంపీడీవో ఆలీం పరిశీలించారు. మొక్కలను కాపాడుతూ ప్రతి రోజూ నీరు పోయాలని వనసేవకులకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల పరిశీలన



ఏఈని వివరాలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాంటా చౌరస్తా పక్కన నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. మార్కెట్ నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించారు. నిర్మాణ పనుల గురించి తగు సూచనలు చేశారు. సత్వరంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు విధిగా పాటించాలని సూచించారు. మార్కెట్‌ను సందర్శించిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వార్డు కౌన్సిలర్ కొమ్ముల సురేష్, ఏఈ సందీప్, టీఓ అశ్రిత్ తదితరులు ఉన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హోంశాఖ మంత్రి

నస్పూర్: పట్టణ పరిధిలోని సంఘం మల్లయ్యపల్లెకు చెందిన పాదం సుధాకర్ రచించిన భారతదేశ భూగోళశాస్త్ర పుస్తకాన్ని రాష్ట్ర హోం మినిస్టర్ మహమూద్ అలీ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హోం మినిస్టర్ మాట్లాడుతూ సుధాకర్ రచించిన ఇలాంటి పుస్తకాలు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో వాసు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్‌జీవోలు

మంచిర్యాలక్రైం: మదర్‌థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ మందమర్రికి చెందిన కే. భువనేశ్వరి ఎన్‌జీవో, డీ మాధవన్ జనరల్ సెక్రటరీ మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న విద్యాపరమైన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

జర్నలిస్టులకు కంటి పరీక్షలు



డీపీఆర్‌వోకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని జర్నలిస్టులకు కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల డీపీఆర్‌వో సంపత్ కుమార్‌కు కంటి పరీక్షలు చేసి, కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డెమో వెంకటేశ్వర్, వార్డు కౌన్సిలర్ అంకం నరేశ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 150మందికి కంటి పరీక్షలు చేసినట్లు వెంకటేశ్వర్ తెలిపారు. కంటి సమస్యలు ఉన్న వారిలో దగ్గరి చూపు ఉన్నవారికి రీడింగ్ గ్లాసెస్ ఇవ్వగా, కంటి సమస్యలు ఉన్న వారికి ప్రిస్క్రిప్షన్‌లో నమోదు చేసిన కళ్ల అద్దాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, నెల రోజుల్లోపు వస్తాయని తెలిపారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన

చెన్నూర్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని అయిదో వార్డులో నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగాధర్ పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్ నసీమాబేగం, ఆరీఫ్, 4వ వార్డు కౌన్సిలర్ రేవెల్లి మహేష్, వార్డు అధికారి మతిన్, వార్డు ఆర్పీ లలిత, మెడికల్ అధికారి సురేష్ ఉన్నారు.

టూటౌన్‌పై పట్టింపేది?



వేములబస్తీలో డ్రెయినేజీ నిర్మించక తవ్వి వదిలేసిన దృశ్యం



గోపాల్‌వాడలో రోడ్డు వద్ద నిలిచిన మురికి నీరు



రాజీవ్‌నగర్‌లో డ్రెయినేజీ లేక ఇళ్ల ముందే...

- కాలనీల్లో డ్రెయినేజీలు కరువు
- ఖాళీ స్థలాల్లోనే మురుగు నీటి నిల్వ
- దోమలతో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంగా మారినా మంచిర్యాల మున్సిపాలిటీలో దాదాపుగా సగభాగం ఉన్న టూటౌన్ ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంటోంది. జిల్లా కేంద్రంగా మారక ముందు ఏ విధంగా టూటౌన్‌ను పట్టించుకోకుండా వదిలేశారో, ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంగా మారి మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతున్నా, టూటౌన్ ప్రాంతంలోని పలు కాలనీల్లో ఇప్పటికీ డ్రెయినేజీల నిర్మాణం చేపట్టడం లేదు. సరైన రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేక ఆయా కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంచిర్యాలలో దాదాపుగా సగభాగం రైలు పట్టాలకు అవతల వైపున ఉండే టూటౌన్‌లో అభివృద్ధి చేపట్టేందుకు పనులు ఉన్నా ముందుకు సాగడం లేదు. ఎన్నో ఏళ్లుగా రైల్వే బ్రిడ్జిని కావాలని కోరుకోగా, అండర్‌బ్రిడ్జి నిర్మాణంతో కొంత వరకు సమస్య తీరింది. రాజీవ్‌నగర్, తిలక్‌నగర్, గోపాల్‌వాడ, వేముల బస్తి, హమాలివాడ, అశోక్‌రోడ్డు, సూర్యనగర్, దొరగారిపల్లె కాలనీలు ఇప్పటికీ వెనుకబడే ఉన్నాయి. రాజీవ్‌నగర్‌లో డ్రెయినేజీలు లేక ఇళ్ల మధ్యనే మురికి నీరు పారుతుండగా, తాగునీటి పైపులు ఆ మురికి నీటిలోనే ఉండాల్సిన పరిస్థితి. మురికినీరు వెళ్లేందుకు డ్రెయినేజీలు లేక, ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లోనే మురికి నీరు వచ్చి చేరి, ఆకుపచ్చ రంగులోకి మారుతోంది. వేముల బస్తీ, గోపాల్‌వాడ కాలనీల్లోని ఖాళీ ప్రాంతాల్లో మురికి నీటి నిల్వలు ఉండి, రోడ్లపై ఆ నీరు పారుతోంది. మురికి నీటి నిల్వతో దోమలు వృద్ధి చెందడం, దుర్వాసన, రోగాల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. కేవలం వన్‌టౌన్‌లోనే అభివృద్ధి పనులను చేపడుతున్నారని, టూటౌన్ ప్రాంతంలోనూ ప్రజలకు అవసరమైన కనీస మౌలిక వసతులను కల్పించి, డ్రెయినేజీలు నిర్మించాలని ఆ కాలనీ ప్రజలు కోరుతున్నారు.

కాలినడక వంతెన నిర్మించాలని దీక్ష



దీక్ష చేస్తున్న టూటౌన్ కాలనీ ప్రజలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని టూటౌన్ ప్రజలు కాలినడకన వచ్చేందుకు ఉన్న రైల్వే గేటును పూర్తిగా మూసివేయడం వల్ల దినసరి కూలీలు, పేదలు రైల్వే ట్రాక్ దాటేందుకు అండర్‌బ్రిడ్జి నుంచి వెళ్లాల్సి వస్తుందని, దీని వల్ల ఇబ్బందులున్నాయంటూ టూటౌన్ ప్రజలు రైల్వే గేటు వద్ద మంగళవారం నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టూటౌన్ ప్రాంతంలో ఎక్కువ మంది దినసరి కూలీలు, చిరు ఉద్యోగాలు చేసుకునే వారే ఉన్నారని, వారు మంచిర్యాల వన్‌టౌన్‌కు రావాలంటే రైలు పట్టాలను దాటాల్సిందేనని అన్నారు. రైల్వే గేటును మూసివేయడం వల్ల ఇన్నాళ్లు రైల్వే గేటు వద్ద నడకదారిలో వెళ్లే వారికి దారి లేకుండా పోయిందని, అండర్‌బ్రిడ్జి వద్ద కాలినడక వంతెనను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు జైపాల్‌సింగ్, దేవి సత్యం, కడప సుగుణ, గిరిధర్, కడప విజయ, శీతల్ ఠాకూర్, సరస్వతి, శోభబాయి, సునిత, భారతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటల్లో రాణించాలి

- జీఎం సంజీవరెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జీఎం

శ్రీరాంపూర్: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని, దీనికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో నస్పూర్ మండలంలోని ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకొని మంగళవారం ఈ పోటీలను ఏరియా జీఎం సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా పటిమ బయటికి వస్తుందన్నారు. ప్రతి రోజూ పిల్లలను మైదానంలో ఆడించాలన్నారు. ఆటల వల్ల పోటీతత్వం పెరుగుతుందన్నారు. మంచి స్నేహ సంబంధాలు చిగురిస్తాయన్నారు. పోటీలు నిర్వహించిన ట్రస్మా సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించారు. విజేతలకు సాయంత్రం బహుమతి ప్రదానం చేశారు. 15పాఠశాలల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, శ్రీరాంపూర్ ఎస్సై మానస, డీజీఎం(పర్సనల్) గోవిందరాజు, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి, కౌన్సిలర్లు పూదరి కుమార్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ ఎస్ రాంచందర్, ట్రస్మా జిల్లా నాయకుడు దేవన్న, ఏరియా అధ్యక్షులు విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి మైదం రామకృష్ణ, సభ్యులు ఊట్ల సత్యనారాయణ, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రాజు, రజని పాల్గొన్నారు.

కూల్ వాటర్ క్యాన్ల పంపిణీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని పలు డిపార్టుమెంట్ల వద్ద పని చేసే కంపెనీ సెక్యూరిటీ గార్డులకు వేసవి దృష్ట్యా కూల్ వాటర్ క్యాన్లను పంపిణీ చేశారు. జీఎం కార్యాలయం వద్ద మంగళవారం జీఎం సంజీవరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కంపెనీ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ గార్డులు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూజీఎం త్యాగరాజు, ఏరియా ఇంజనీర్ రమేశ్‌బాబు, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, డీజీఎం(పర్సనల్) సోమశేఖర్, క్వాలిటీ మేనేజర్ కే వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి



చెన్నూర్: మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



భీమారం: నివాళులర్పిస్తున్న నాయకులు



లక్సెట్టిపేట: పూలమాల వేస్తున్న సంఘం నాయకులు

చెన్నూర్: ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చెన్నూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో రమాబాయి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె చేసిన సేవల గురించి కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, చెన్నూర్ డివిజన్ కార్యదర్శి అనీల్, మండల కమిటీ సభ్యుడు ఓదెలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో రమాబాయి చిత్రపటానికి సర్పంచులు సమ్మయ్య, తిరుపతితో పాటు బీఆర్ఎస్ నాయకులు రమేశ్, బలరాంరెడ్డి, పెద్దల బాపు,మల్లేశ్ నివాళులర్పించారు.

లక్సెట్టిపేట: మండలంలోని అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘ భవనంలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దొంత నర్సయ్య, మండల నాయకులు లింగన్న, నారాయణ, రాజన్న, సురేష్ నాయక్, రవీందర్, జనార్దన్, రమేష్, భీమయ్య, పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: రమాబాయి జయంతిని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. రమాబాయి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల కో ఆర్డినేటర్ పలిగిరి కనకరాజు, నాయకులు దేవి సత్యం, దేవి పోచన్న, ఎడ్ల సత్యం, కనుకుట్ల మల్లయ్య, సూరమళ్ల రాంచందర్, సిద్ధార్థ రామ్మూర్తి, రాంటెంకి శ్రీనివాస్, జుమ్మిడి గోపాల్, జైపాల్‌సింగ్ పాల్గొన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్



క్యాలెండర్ పంపిణీ చేస్తున్న కొక్కిరాల సురేఖ

బెల్లంపల్లి/శ్రీరాంపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్ర మంగళవారం రెండో రోజు కొనసాగింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల శ్రేణులు సామూహికంగా తరలివచ్చి గడపగడపకూ వెళ్లారు. కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్‌గాంధీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించి కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లిలో కాంగ్రెస్‌పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు శంకర్, నస్పూర్‌లో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పట్టణ అధ్యక్షుడు సుధాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేణు, హాజీపూర్ మండల ఇన్‌చార్జి, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తిరుపతి, మండల అధ్యక్షుడు రవి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజమౌళి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రికార్డులు తనిఖీ

భీమారం: మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీకి చెందిన రికార్డులను సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ మేరకు గ్రామంలో ప్రభుత్వ నిధుల ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో పాటు గ్రామ ప్రజల ద్వారా వచ్చే ఆదాయాన్ని రికార్డుల్లో తనిఖీ చేశారు. ప్రతి పనికి రికార్డు తయారు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇందులో ఎంపీవో సతీశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రంథాలయానికి స్థలం కేటాయించాలి

తాండూర్: గ్రంథాలయ భవనం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని మండలంలోని రేచిని గ్రామ యువకులు తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మంగళవారం సామూహికంగా వచ్చి తహసీల్దార్‌కు ప్రభుత్వ భూమికోసం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ యువకులు భాస్కర్ గౌడ్, శ్రీనివాస్, సోమయ్య, ఆనంద్, మధూకర్, సాయికిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్: పట్టణ పరిధిలోని తోళ్లవాగును కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపట్టిన ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని మంచిర్యాలకు చెందిన నాగేశ్వర్‌రావు, భీరయ్య అనే ఇద్దరు వ్యక్తులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ పీఓ సురేశ్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

సెర్ప్ ఉద్యోగుల సంబురం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బడ్జెట్ సమావేశాల్లో సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు సెర్ప్–డీఆర్‌డీఏ ఉద్యోగ సిబ్బందికి ఏప్రిల్ నుంచి పీఆర్సీ పే స్కేల్ అమలు చేస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఐకేపీ జిల్లా కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు సంబురాలు వ్యక్తం చేసి మిఠాయిలు పంచుకున్నారు.

వినతిపత్రం అందజేత

చెన్నూర్‌రూరల్: మండలంలోని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటి స్థలాలు, ఇంటి స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చెన్నూర్ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి అవేజ్, చెన్నూర్ పట్టణ అధ్యక్షుడు మారన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వేలాలలో బహిరంగ వేలం



వేలంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జైపూర్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 18న నిర్వహించే వేలాల మల్లన్నస్వామి జాతర సందర్భంగా మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాహనాల పార్కింగ్, కొబ్బరికాయల విక్రయం, బోల్‌పేలాల విక్రయంపై బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలంలో 19మంది వ్యక్తులు పాల్గొనగా కొబ్బరికాయల విక్రయానికి వేలాల గ్రామానికి చెందిన గోదారి రాములు రూ.4లక్షల 15వేలకు వాహనాల పార్కింగ్ నిర్వహణకు వేలాల గ్రామానికి చెందిన సుందిళ్ల దేవయ్య రూ.2లక్షల 95వేలు, బోల్‌పేలాల విక్రయానికి వేలాల గ్రామానికి చెందిన గోదారి రాజయ్య రూ.41వేలకు వేలం ద్వారా దక్కించుకున్నారు. కాగా ఆలయానికి సంబంధించిన లడ్డూప్రసాదం విక్రయం, కొబ్బరిముక్కల సేకరణకు నలుగు వ్యక్తులు మాత్రమే రావడం గతేడాది జాతర కన్నా తక్కువకు వేలం పాడగా దాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తూ మరో సారి వేలం నిర్వహించనున్నట్లుగా ఆలయ ఈవో రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్యాగ శ్యామల, ఎంపీటీసీ బూడే రాజేశ్వరి, ఉపసర్పంచ్ డేగ నగేశ్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, నాయకులు మేడి తిరుపతి, గోదారి లక్ష్మణ్, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: ఏరియాలోని కార్మికుల పెండింగ్ సమస్యలు యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏరియాలోని కేకే–5 గనిని మంగళవారం సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా విధుల్లో చేరిన కార్మికులకు బూట్లు, హెల్మెట్లు పంపిణీ చేయడంలేదని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట యూనియన్ నాయకులు సుదర్శన్, తిరుపతి, శ్రీనివాస్, సంపత్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పోడు సాగుదారులకు హక్కు పత్రాలివ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భీమిని: పోడు భూమి సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని అటవీ సంరక్షణ నియమాలు 2022ను రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో భీమిని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ మాట్లాడుతూ పోడు భూమి సాగుదారులకు హక్కు పత్రాలిచ్చేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. గిరిజనులకు, ఆదివాసీలకు, గిరిజనేతరులకు సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారని, శాటిలైట్ పేరుతో అనేక మంది రైతుల దరఖాస్తులు తిరస్కరించారన్నారు. ఒకే గ్రామంలో 75సంవత్సరాలు పోడు సాగు చేసుకున్న ప్పటికీ పట్టాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, జిల్లా నాయకులు గడ్డం రమేశ్, ఆదె చంద్రన్న, మండల నాయకులు సత్తన్న, తుకారాం, శంకర్, రాజేశ్వర్, తిరుపతి, మల్లేష్, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మిమ్స్ విద్యార్థుల సత్తా

మంచిర్యాలఅర్బన్: జేఈఈ 2023మెయిన్స్ తొలివిడత ఫలితాల్లో మిమ్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో ఎన్‌టీఏ విడుదల చేసిన ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులు ఉత్తమంగా నిలిచినట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరాజు తెలిపారు. కళాశాలకు చెందిన బట్టారి సత్యతేజ 88.28శాతం, మనీష్ 87.33శాతం, రోహిత్ 85.07శాతం సాధించారన్నారు. అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శైలజతో పాటు డైరెక్టర్లు అభినందించారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

దండేపల్లి: భారత ప్రధాని నరేంద్రమోదీ విశ్వబ్రాహ్మణులను గుర్తించి విశ్వబ్రాహ్మణుల కోసం 'పీఎం విశ్వకర్మకౌశల్' పథకాన్ని ప్రవేశపెట్టడంపై దండేపల్లిలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక జయశంకర్ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి సంఘ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా విశ్వబ్రాహ్మణులను గుర్తించి 'విశ్వబ్రాహ్మణ బంధు' అందించి విశ్వబ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధికి చేయూత నందించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చొప్పదండి రమేశ్, కట్ట వెంకటేశ్, వేమునూరి రాంబాబు, పాలకుర్తి లక్ష్మణ్, వేమునూరి లక్ష్మి నారాయణ, నూతి శ్రీకాంత్, భీమోజు కరుణచారి, రవి, సత్యనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత.. ప్రయాణికుల చింత



వేమనపల్లి: మంగెనపల్లి-రాజారాం వెళ్లే దారిలో చల్లగట్టు పొలం వద్ద రోడ్డుపై గుంత ప్రమాదకరంగా ఉంది. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : పులి శ్రీధర్, పంచాయతీ రాజ్ ఏఈ ఫోన్ నంబర్ : 9573389679